క్లుప్తంగా

సమస్యలపై వినతి



ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

అనంతగిరి: మండలంలోని భీంపోల్ పంచాయతీ కేంద్రం నుంచి సరియాపల్లి వరకు నిలిచిపోయిన రోడ్డు పనులను వేగవంతానికి చర్యలు చేపట్టాలని కోరుతూ అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు శనివారం వినతిపత్రం అందజేసినట్టు ఎంపీటీసీ సభ్యుడు అశోక్ తెలిపారు. పంచాయతీలోని భూ రీసర్వే, చెక్‌డ్యాంలు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు తదితర సమస్యలపై వివరించినట్టు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సానుకూలంగా స్పందించినట్టు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ చిన్నయ్య, శ్రీనివాసరావు, దేముడు, అప్పారావు పాల్గొన్నారు.

డ్రాయింగ్ టీచర్‌కు సన్మానం



టీచర్ కొండబాబును సత్కరిస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిత్రలేఖనం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మిరియాల కొండబాబును సహచరులు, గ్రామస్తులు శనివారం ఘనంగా సన్మానించారు. వద్దాది చోడవరం చిత్ర కళానిలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయనను సత్కరించారు. విద్యార్థులను చిత్రలేఖనంలో తీర్చిదిద్దడమే కాక వారు పలు జాతీయ స్థాయి పోటీల్లో గుర్తింపు పొందేలా తర్ఫీదు ఇవ్వడంలో కొండబాబు కృషి, సేవలను కొనియాడారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ బాలయ్య

చింతపల్లిరూరల్: మండలంలోని కొత్తపాలెం పంచాయతీ బోంగూడ గ్రామం నుంచి పొట్టబంద గ్రామానికి రూ.60లక్షలతో చేపట్టిన రోడ్డు పనులకు జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి రహదారి లేని గ్రామాలకు ప్రభుత్వం కోట్లాది రూపాయలతో రోడ్ల పనులు చేపడుతోందన్నారు. ఫలితంగా శివారు గ్రామాలకు రవాణా సదుపాయం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. వైస్ ఎంపీపీ శారద, కొత్తపాలెం సర్పంచ్ వనగల సోమరత్నం, ఎంపీటీసీ రాజులమ్మ, జిల్లా కమిటీ కార్యదర్శి గణబాబు, నాయకుడు బెన్నిబాబు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

చింతపల్లిరూరల్: మండలంలో లంబసింగి వద్ద శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో పర్యాటకుల కారు దెబ్బతింది. విశాఖపట్నానికి చెందిన పర్యాటకులు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పైపులైన్ పనుల నిమిత్తం తవ్విన గోతులో చిక్కుకుంది. పొగమంచు దట్టంగా ఉండడంతో ఎదురుగా ఉన్న గోతులు కనిపించక ప్రమాదం జరిగినట్టు తెలిసింది. ఈ సంఘటనలో ఎవరికి ప్రమాదం జరగలేదు. త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ మార్గంలో మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

డుంబ్రిగుడ: కించుమండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నాంది ఫౌండేషన్ సంస్థ సమకూర్చిన బ్యాగులు, స్టేషనరీ తదితర సామగ్రిని ఉపాధ్యాయులు అందజేశారు. విద్యార్థులకు సంస్థ బ్యాగులు, పెన్నులు, నోటు పుస్తకాలు, పౌచ్‌లు, రెయిన్‌కోట్లు సమకూర్చడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. నాంది ఫౌండేషన్ సేవలను కొనియాడారు. టీచర్లు విజయ్‌కుమార్, అప్పలరాజు, బొబ్బిలి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రంపచోడవరం: ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(అనంతబాబు) అన్నారు. మండలంలోని మండలం వేములకొండ సచివాలయ పరిధిలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మేరకు సచివాలయ పరిధిలోని వేములకొండ, కాకవాడ తదితర గ్రామాల్లోని 225 గడపలను వారు సందర్శించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేములకొండ పంచాయతీ పరిధిలో సంక్షేమ పథకాలు అమలుకు, అభివృద్ధి పనుల కోసం రూ.28.44కోట్లు ఖర్చు చేశామన్నారు.

జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. లబ్ధిదారులకు వ్యక్తిగతంగా చేకూరిన ప్రయోజనాన్ని వివరించారు. ఏజెన్సీలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. టీడీడీ ఏళ్ల తరబడి పాలన చేసినా ఏజెన్సీలో గ్రామాలకు సరైన రహదారి సౌకర్యాలు కల్పించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి శివారు గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పనతో పాటు రవాణా సదుపాయం కల్పించిందన్నారు. వేములకొండ గ్రామంలో రూ. 70లక్షలతో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, , వెల్‌నెస్ సెంటర్‌లకు నూతన భవనాలు నిర్మించినట్టు చెప్పారు.



కాకవాడలో స్థానికులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

రూ.3 కోట్లతో దబ్బవలస -వెట్టి చెలకల, రాతిమామిడి వరకు, రూ. 90 లక్షలతో పీరుకొండ -తిరగటిరాళ్ల వరకు రహదారి పనులు ప్రారంభించినట్టు చెప్పారు. రూ. 25లక్షల వ్యయంతో సీమగండిలో కల్వర్టు నిర్మాణం చేసామన్నారు. నవరత్నాల పథకాల్లో భాగంగా మండల పరిధిలో 1200 మందికి రూ. 6.54లక్షలు లబ్ధి చేకూరిందన్నారు.రూ. 13.69లక్షలు కాకవాడ-ఆకూరు బిటీ రోడ్డు మంజూరైందన్నారు. త్వరలో పనులు ప్రారంభమవుతాయన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా తీర్చిదిద్దినట్టు చెప్పారు. కాకవాడ ఆశ్రమ పాఠశాలను రూ. 35 లక్షల వ్యయంతో అభివృద్ధి చేశామన్నారు.పీరుకొండ, రాకోట, సీమగండి, సోకులగూడెం, సువర్లవాడ, తిరగటిరాళ్లు, వేములకొండ, దబ్బవలస గ్రామాల్లో తాగునీటి సౌకరార్థం పలు పనులు ప్రారంభమైనట్టు చెప్పారు. వేములకొండ సచివాలయ పరిధిలో అభివృద్ధి పనుల కోసం రూ. 21.9కోట్లు ఖర్చు చేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేశామన్నారు. కాకవాడ గండిపై సెల్ నెట్‌వర్క్ అందుబాటులో తీసుకువచ్చినట్టు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత బాధ్యతగా పనిచేసి ఏజెన్సీ మరింత అభివృద్ధికి కట్టుబడి ఉంటామన్నారు. ఈ ప్రాంతంలో గిరిజనుల సాగులో ఉన్న 4622 ఎకరాల అటవీ హక్కుల చట్టం ద్వారా పట్టాలు మంజూరు చేసినట్టు తెలిపారు. 102 మందికి కొత్త ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ , సర్పంచ్ పండుదొర, మంగా బొజ్జయ్య, ఎంపీటీసీ సభ్యుడు కుంజం వంశీ, సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర, మండల పార్టీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్నదొర, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్‌లాలీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

డుంబ్రిగుడ: మండలంలోని కోల్లాపుట్టు పంచాయతీ బూసిపుట్టు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు చట్టారి జానకమ్మ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రజారోగ్యమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ మేరకు ప్రజల చెంతకే వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య శిబిరాలు నిర్వహిస్తోందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 320 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. రోగులందరికి ఉచితంగా భోజనాలు సమకూర్చారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు రామారావు, వైస్ ఎంపీపీ లలిత, నాయకురాలు లీలరాణి, వైద్యులు ప్రేమ, రాంబాబు, విజయ తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ ఈశ్వరి, జెడ్పీటీసీ జానకమ్మ, నేతలు

అర్హులను ఓటరుగా నమోదు చేయండి



గడుతూరులో కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ అప్పలస్వామి, ఎంపీడీవో జయసాగర్



కొత్తూరులో ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి



పెద్దగెద్దడలో ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్



ఓట్ల సవరణ దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు


జి.మాడుగుల/హుకుంపేట/రంపచోడవరం: జిల్లాలో జి.మాడుగుల, హుకుంపేట, రంపచోడవరం ప్రాంతాల్లో శనివారం ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో తహసీల్దార్లు కె.అప్పలస్వామి, రాజ్యలక్ష్మి, పి.వి.వి.జయకుమార్‌లు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు నమోదుకు సంబంధించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అవసరమైన వారు తమ ఓటరు కార్డులోని అడ్రసులు, ఇతరత్రా మార్పులపై దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇంటింటికీ వెళ్లి ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేయాలని సిబ్బందికి సూచించారు.ఓటరు డ్రైవ్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో జయసాగర్, వీఆర్వో జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం తనిఖీ

మారేడుమిల్లి: గుజ్జుమామిడి వలస గ్రామంలోని 175 పోలింగ్ కేంద్రాన్ని మారేడుమిల్లి తహసీల్దార్ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ బాలాజీ శనివారం తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు. ఓటు హక్కు గురించి వారికి అవగాహన కల్పించారు. బీఎల్‌వో మురళీకృష్ణ, సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ఆర్‌బీకే

డుంబ్రిగుడ: మండలంలోని సాగర, కొర్రాయి గ్రామ సచివాయ పరిధిలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలను ప్రారంభానికి సిద్ధమైంది. రూ.,సుమారు 24లక్షలతో నిర్మాణం చేపట్టిన రైతు భరోసా కేంద్రాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్మాణం ముమ్మరంగా చేపట్టారు. అధికారుల ఆదేశాల మేరకు రైతు భరోసా కేంద్రాలను ప్రారంభానికి సిద్ధం చేసిన్నట్టు కాంట్రాక్టు శ్రీను తెలిపారు.



సాగర గ్రామంలో రైతు భరోసా కేంద్రం

సారాతో ఒకరి అరెస్టు

కొయ్యూరు: సారా తయారు చేస్తున్న దొడ్డవరానికి చెందిన తంటపురెడ్డి వీర్రాజును అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ రాజారావు తెలిపారు. అతని నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. అధి ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా సారాపై దాడులు చేసి అరెస్టులు చేస్తున్నామని ఆయన చెప్పారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు నిర్ణయంపై హర్షం

పాడేరు రూరల్ : రాష్ట్రంలోని పత్రికలు, ఛానళ్లలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తూ క్యాబినెట్‌లో తీర్మానం చేయడంపై పాడేరు ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు నవర మోదకొండబాబు, కొంటా దుర్గారావు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొంగమల్లి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వి.జోషి, ఇతర ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీను నెరవేర్చడం ఆనందంగా ఉందన్నారు.

చింతూరు: అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ మంత్రివర్గం ఆమోదించడంపై ఏపీయూడబ్ల్యూజే సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఏజెన్సీలో పనిచేస్తున్న జర్నలిస్టులకు స్థానిక ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు ఏజెన్సీ చట్టాలు అమల్లో ఉన్నాయని, ఈ మేరకు మైదాన ప్రాంతాల్లో స్థలాల కేటాయించాలని కోరుతూ ఐటీడీఏ పీవో కావూరి చైతన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా చూస్తానని పీవో వారికి హామీ ఇచ్చారు. మాసినేని చంద్రశేఖర్, చదలవాడ విజయ్‌కుమార్, మస్తాన్‌జానీ, ఈశ్వరాచారి, రియాజ్, జీవన్, రామారావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గ ఎన్నిక

అడ్డతీగల: యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్షుడిగా కుంజం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్‌బాబు అధ్యక్షతన స్థానిక ఎంఆర్‌సిలో మండల నూతన కౌన్సిల్ ఎన్నిక శనివారం జరిగింది.ఈ మేరకు కౌన్సిల్ అధ్యక్షులు కుంజం శ్రీనివాస్ మండల నూతన కమిటీకి ఎన్నికైన కార్యవర్గం వివరాలను వెల్లడించారు. ఉపాధ్యక్షులుగా బి.దొరబాబు, జె.వి.వి.రమణమ్మ, ప్రధాన కార్యదర్శిగా కె.వి.రాఘవులు, కోశాధికారిగా ఎస్.జగదీష్, ఎఫ్‌డబ్ల్యుఎస్‌గా కె.చిన్నారావు, పత్రికావిభాగ ఎ.గాంధీరెడ్డి, మహిళా కార్యదర్శిగా కె.కమలరత్నం, మండల ఆడిటర్‌గా ఎం.నరసింహారెడ్డి, కార్యదర్శులుగా ఎం.మల్లీశ్వరి, ఎం.అపర్ణ, పి.వి. సత్యప్రభ, ఎం.చిన్నారావు, సిహెచ్.సావిత్రిప్రసాద్, జీఎస్ఆర్ పడాల్, జిల్లా కౌన్సిలర్లుగా జి.తేజోరావు, ఎస్.నాగప్రసాద్,ఎస్.చిన్నిబాబు, కె.కరుణశ్రీ,, వి.బాలరాజు, ఇ.పాపారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న నాయకులు

ముంచంగిపుట్టు: మండలంలోని బాబుశాల పంచాయతీ మత్స్యపురం గ్రామంలో యువకులకు అరకు వైఎస్సార్‌సీపీ నేత, మాజీ సర్పంచ్ పాంగి చిన్నారావు క్రికెట్ కిట్‌లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువత చదవుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈనెల 26 నుంచి జరగనున్న పోతురాజు పండగ నేపథ్యంలో నిర్వహించనున్న మండల స్థాయి క్రికెట్ పోటీలకు తన సహకారం అందిస్తామన్నారు. సర్పంచ్‌లు రమేష్, అశోక్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ కాసులమ్మ, మాజీ సర్పంచ్ కేశవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సుభాష్, నానిబాబు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వినతి



ఎంఈవో కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

ముంచంగిపుట్టు: మండలంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై మండల యూటీఎఫ్ ప్రతినిధులు రాజు, గోపి తదితరులు ఎంఈవో కృష్ణమూర్తికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయులు సర్వీసెస్ రిజిష్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని తదితర సమస్యలను వినతిలో పేర్కొన్నారు. అప్పలనాయుడు, శ్రీనివాసమూర్తి, త్రినాథ్, చిన్నబ్బాయి, మత్స్యరాజు, ధర్మారావు ఉన్నారు.

150 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు జగన్

చింతపల్లిరూరల్: కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని వైద్యుడు జగన్ సూచించారు. మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో విశాఖపట్నానికి చెందిన దృష్టి ఐ కేర్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా దృష్టి ఐ కేర్ మేనేజింగ్ డైరెక్టర్, కన్సల్టెంట్ ఆప్తమాలజిస్ట్ డాక్టర్ గాలి జగన్ మాట్లాడుతూ ఐటీడీఏ సహకారంతో కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 500 మందికి వైద్య పరీక్షలు జరిపి, 1300 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశామన్నారు. శిబిరంలో 150 మందికి కంటి వైద్య పరీక్షలు చేశామన్నారు. దీర్ఘకాలిక కంటి సమస్యలున్న వారికి విశాఖపట్నంలో సెంటర్‌కు సిఫార్సు చేస్తున్నామన్నారు. వైద్య పరీక్షలకు ఈహెచ్ఎస్, ఈఎస్ఐ, ఆరోగ్యశ్రీ, తెల్లరేషన్‌కార్డు కలిగిన వారు అర్హులన్నారు. రోగులకు ఉచిత రవాణా, భోజన వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు.

పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలి

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి, ప్రభుత్వ కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేసి, అర్హులందరికీ పథకాలు అందేలా చూడాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండల కేంద్రంలోని శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచి ×ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి¥ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు ఈ కార్యక్రమంపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. పార్టీ శ్రేణులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని కోరారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పాంగి సింహాచలం, మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు ఒంటుబు శామ్యూల్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామకృష్ణ, మండల పార్టీ గౌరవ అధ్యక్షుడు గండేరు చినసత్యం, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎంపీపీ రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం

అనంతగిరి: మండల కేంద్రంలో ఈనెల 9 నుంచి 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమంపై విస్తృతంగా పార్టీ నాయకులు ప్రచారం చేయాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ తీరుపై ధ్వజం

గూడెం కొత్తవీధి/కొయ్యూరు/ఎటపాక/రాజవొమ్మంగి: జిల్లాలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జీకే వీధి, కొయ్యూరు, ఎటపాక, రాజవొమ్మంగి ప్రాంతాల్లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పలు సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజన హక్కులు, చట్టాలు నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని, ప్రజా వ్యతిరేక విధానాలు అమలుచేస్తోందని, దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ యోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జాతీయ రహదారి విస్తరణలో తమకు న్యాయం చేయాలని కోరుతూ పలువురు బాధితులు వినతిపత్రం అందజేశారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని కోరారు. కిల్లో సురేంద్ర, అప్పలనర్స, చిన్నయ్యపడాల్, బుజ్జిబాబు, సూరిబాబు, గంగరాజు, సుబ్బారావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్టీ నేత శ్రీనివాసరావు

క్రికెట్ టోర్నీ ప్రారంభం

చింతూరు: స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు మెగా క్రికెట్ టోర్నమెంటును ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చుడి మురళి, ఎంపీపీ సవలం అమల శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహద పడతాయన్నారు. గ్రామీణ స్థాయిలో ఇలాంటి క్రీడలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఎలాంటి వివాదాలకు తావులేకుండా తమ క్రీడాస్ఫూర్తిని చాటుకోవాలని సూచించారు. చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలకు చెందిన 60 జట్లు పాల్గొంటాయని యూత్ సభ్యులు తెలిపారు. సీఐ అప్పలనాయుడు, సర్పంచ్ కారం కన్నారావు, కో-ఆప్షన్ మెంబర్ ఎండీ అక్బర్‌అలీ, నాయకులు అహ్మద్‌అలీ, సీసం సురేష్, రియాజ్, రాజు, యూత్ సభ్యులు ప్రదీప్, గణేష్, షాహిద్ పాల్గొన్నారు.



టోర్నమెంటును ప్రారంభిస్తున్న ఎంపీపీ సవలం అమల

శిశువు పోషణకు ఆర్థిక సాయం

రాజవొమ్మంగి: తల్లి మృతితో తల్లడిల్లుతున్న శిశువు పోషణకు అవసరమైన సాయాన్ని ఓ స్వచ్ఛంద సంస్థ శనివారం అందించింది. మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీ పరిధిలో వణకరాయి గ్రామానికి చెందిన బాలింత లక్ష్మీదేవి అనారోగ్యంతో చికిత్స పొందుతు మృతి చెందడం తెలిసిందే. ఆమెకు మూడు నెలల పాప ఉంది. పేద కుటుంబం కావడంతో శిశువు పోషణకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న సేవావారధి అనే స్వచ్ఛంద సంస్థ సామందించేందుకు ముందుకొచ్చింది. ఈ మేరకు సంస్థ ఆర్గనైజర్ చోడి సుధాకర్ బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. శిశువు కోసం నెల రోజులకు సరిపడా పాలప్యాకెట్లు, రూ.2500 ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. తల్లిలేని శిశువును ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని, సాయం కోసం 9491859820 నెంబర్‌కు సంప్రదించాలని బాధితులు కోరుతున్నారు.



పాలప్యాకెట్లు, ఆర్థిక సాయమందిస్తున్న దాత సుధాకర్

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

అరకులోయటౌన్: మండల కేంద్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో చిన్న మొత్తాల పొదుపు సంఘం ఆధ్వర్యంలో లబ్దిదారులకు రుణాలను బ్రాంచ్ మేనేజర్ ప్రసన్నకుమారి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులందరూ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొత్తాల పొదుపు సంఘంలో ఐదుగురు సభ్యులుగా ఒక గ్రూపుగా ఏర్పడితే రుణాలు అందజేస్తామన్నారు. సంఘ సభ్యులు సమీపంలోని పొదుపు సంఘం కార్యలయంలో సంప్రదించి అవసరమైన ధ్రువపత్రాలు అందజేసి రుణాలు పొందవచ్చన్నారు. ఈ పొదుపు సంఘం ద్వారా గరిష్టంగా రూ. 5లక్షలు పొందవచ్చన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్ సతీమణి కిల్లో సుజాతకు రూ.2 లక్షలు రుణం అందజేశారు. మరిన్ని వివరాల కోసం 63044 88600, 94922 84540 నంబర్లకు సంప్రదించాలని కోరారు.



సుజాతకు నగదు అందజేస్తున్న బీఎం ప్రసన్నకుమారి

బాధితులకు అండగా ప్రభుత్వం

ముంచంగిపుట్టు: సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు అండగా జగనన్న ప్రభుత్వం నిలుస్తోందని జర్రెల సర్పంచ్ నాయకం భాగ్యవతి అన్నారు. మండలంలోని జర్రెల పంచాయతీ మండిభ గ్రామంలో శనివారం సికిల్‌సెల్ ఎనిమియా బాధితురాలు పాలసి జ్యోతికు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10వేల పింఛన్‌ను సర్పంచ్ భాగ్యవతి పంపిణీ చేశారు. గిరిజన ప్రాంతంలో సికిల్‌సెల్ ఎనిమియా బాధితులకు పింఛన్ మంజూరు చేస్తూ వారికి ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకొని, సకాలంలో మెరుగైన వైద్యం అందిస్తుందని సర్పంచ్ భాగ్యవతి అన్నారు. వార్డు సభ్యుడు నీలకంఠం, నాయకులు సురేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ నవజీవన్, వలంటీర్లు లవరాజు, అనంత, కృష్ణ, కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.



సికిల్‌సెల్ ఏనిమియా బాధితురాలికి పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ భాగ్యవతి